క్లుప్తంగా

3న వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువై యున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వార్షికోత్సవ వేడుకలు జూన్ 3న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అయినవోలు శివనాగేశ్వరరావు తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, పట్టు వస్త్రాలతో అలంకరణ, పూజా కార్యక్రమాలను పూజారి చిలకపాటి భరద్వాజ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పురాతన ఆలయం శిధిలావస్థకు చేరటంతో 2017న నూతన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి ప్రతిష్ట నిర్వహించారు. అప్పటి నుండి ప్రతి ఏడాది వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గురు, శనివారాల్లో పూజా, భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణంపై అవగాహన



వినుకొండ (నూజెండ్ల): సామిల్ ఓనర్స్ బొగ్గుల కాంట్రాక్టర్స్‌లకు పర్యావరణహిత జీవన విధానం గురించి అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పర్యావరణ జీవనవిధానం (మిషన్ లైఫ్) కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు వినుకొండలోని అటవీశాఖ కార్యాలయంలో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షించడానికి రోజు వారి జీవితంలో సాధ్యమయ్యే అన్నీ మార్పులు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వినుకొండ అటవీ క్షేత్రాధికారి సయ్యద్ హుస్సేన్, వినుకొండ వెస్ట్ సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

లోఓల్టేజ్ సమస్య పరిష్కారం

శావల్యాపురం: లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్‌శాఖ చర్యలు చేపట్టింది. బుధవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో ఏఈ సంపెంగుల గాంధీ మాట్లాడుతూ మండల కేంద్రంలో గత వారం రోజుల నుంచి లోఓల్టేజ్ సమస్య రావటంతో రైల్వే స్టేషను రహదారి మార్గంలో ఉన్న 100 కె.వి.సామర్థ్యం కల్గిన ట్రాన్స్‌ఫార్మర్ పనులు యుద్ధప్రతిపాదికన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో 1000 ఇళ్ల నివాస గృహాలకు సమస్య పరిష్కారమైందన్నారు.

నేడు సాయిమందిరం వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ షిరిడీ సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు షిర్డీ సాయిబాబా భక్తజన సేవా సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వ్యక్తి తాగి పడవేసిన సిగరెట్ కారణంగా టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని మాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని భాస్కర్ థియేటర్ సెంటర్ ఎదురు ఉన్న టింబర్ డిపో బయట ఉన్న కలపకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా స్పందించిన వారు అక్కడి కి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

గుంతను తప్పించబోయి ఢీకొన్న లారీలు

శావల్యాపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై లారీలు ఢీకొన్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపిన వివరాలు మేరకు వినుకొండ నుంచి మిరపకాయల లోడుతో గుంటూరుకు వెళుతున్న లారీ అదేవిధంగా గుంటూరు నుంచి వినుకొండకు కొబ్బరికాయలు లోడుతో వస్తున్న లారీలు మార్గమధ్యంలో శావల్యాపురంలో ఎదురుగా ఉన్న గుంతను తప్పించ బోయి ఢీకొన్నాయని తెలిపారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా సత్వరమే క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన రెండు లారీలను పక్కకు తప్పించారు. ఈప్రమాదంలో లారీ డ్రైవరుకు తీవ్రమైన గాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు.

మత్తు వదలిస్తారు



డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాల

- బానిసత్వం నుంచి బయటపడేస్తారు
- ఉపశమనం కల్పిస్తున్న డీ అడిక్షన్ సెంటర్
- డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలలో సమర్థవంతంగా పనిచేస్తున్న కేంద్రం



గత శుక్రవారం మద్యానికి బానిసై వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరీక్షిస్తున్న డాక్టర్లు

నరసరావుపేట: డ్రగ్స్, మద్యం, గంజాయి దేనికైనా సరే బానిసలై అనారోగ్యానికి గురై మత్తులో బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా బ్రతికే వారికి నరసరావుపేటలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలలో నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్ మళ్లీ వారికి పునరుజ్జీవనం కలుగు చేస్తోంది. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చిలకా విజయబాబు మద్యానికి పూర్తిగా బానిసై నిలబడలేని స్థితిలో గత సోమవారం ప్రభుత్వ వైద్యశాలలోని డీ అడిక్షన్ సెంటర్‌లో చేరాడు. డాక్టర్లు ఐదురోజులుగా చేస్తున్న వైద్యంతో అతను పూర్తిగా కోలుకున్నాడు. మళ్లీ జీవితంలో మద్యం ముట్టనని చెబుతుంటే అతని ప్రక్కనే ఉన్న భార్యకు ఆనందంతో కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇలాంటి కేసులెన్నింటికో వైద్యశాలలోని డీ అడిక్షన్ సెంటర్ సమాధానం చెబుతోంది.

జిల్లా వ్యాప్తంగా 28 మండలాల్లో 20 లక్షల మంది జనాభా నివాసం ఉంటుండగా ఏపీ వైద్యవిధాన పరిషత్ (ఏపీవీవీపీ) కింద పదిహాస్పిటళ్లు పని చేస్తున్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లిల్లో మూడు ఏరియా హాస్పిటళ్లు, మాచర్లలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, అమరావతి, పెదకూరపాడు, గురజాల, వినుకొండ, విజయపురిసౌత్, ఈపూరులలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఒక్క నరసరావుపేట మినహా మరెక్కడా డీ అడిక్షన్ సెంటర్లు లేవు. అయితే ఆయా హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్లను జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నారు. ఇక్కడ ఒక సైక్రియాటిస్టు డాక్టర్ జి.పార్థసారధిరాజు, మరొకరు అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ సతీష్ నర్సుల సహాయంతో వైద్యసేవలు అందజేస్తున్నారు. పేషెంట్ల కోసం ఆరు బెడ్లను కేటాయించి చికిత్స అందజేస్తున్నారు. కావల్సిన మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. రోజుకు పదిమంది వరకు డీఅడిక్షన్ సెంటర్‌లో వైద్యంకోసం వస్తుండగా వారిలో ఇద్దరు లేదా ముగ్గురికి ఇన్‌పేషెంట్లుగా జాయిన్ చేసుకొని వైద్యం అందజేస్తున్నారు.

ఇంకా ప్రాచుర్యం పొందాలి

నరసరావుపేటలోని 200 పడకల వైద్యశాలలో డీఅడిక్షన్ సెంటర్ ఉన్నట్లుగా చాలా మందికి తెలియదు. గత మూడు నెలల నుంచి ఈ సెంటర్ పని చేస్తోంది. సెంటర్‌కు ప్రచారం కల్పిస్తే పేషెంట్లు పెరిగే అవకాశం చాలా ఉంటుంది. బయట ప్రైవేటు హాస్పిటళ్లలో లక్షల వ్యయమయ్యే వైద్యాన్ని ఇక్కడ ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుంది.

–డాక్టర్ బీవీ రంగారావు, సూపరింటెండెంట్

వారంలోనే రిలీవ్ అవుతున్నారు

మత్తుకు విపరీతంగా బానిసలై డీ అడిక్షన్ సెంటర్‌లో చేరుతున్నారు. మేమిచ్చే వైద్యంతో కేవలం వారంరోజుల వ్యవధిలోనే వ్యాధి నయమై తిరిగి వెళ్లిపోతున్నారు.

– డాక్టర్ పార్థసారధిరాజు, సైక్రియాటిస్టు

ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకోవాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి

పండ్లతోటల సాగుకు రైతులు ముందుకు రావాలి

బొల్లాపల్లి: పండ్లతోటల సాగుకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగపరచుకొని రైతులు ముందుకు రావాలని ఎంపీపీ బత్తి రాములు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పండ్ల తోటల సాగుపై ఉధ్యానశాఖ, వెలుగు పథకం, ఎన్ఆర్ఈజీఎస్ తదితర శాఖల అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ మూడేళ్ళపాటు ప్రభుత్వం రాయితీ అందజేస్తుందని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో పార్వతి, ఉధ్యానశాఖ అధికారి షేక్ నభిరాసూల్‌లు మాట్లాడుతూ రైతులు అదనపు ఆదాయ వనరులు సమకూరాలంటే పండ్ల తోటల సాగు చేపట్టాలని, పండ్లతోటల సాగులో మూడేళ్లపాటు అంతరసాగులు చేసే విధంగా తగిన సేద్య విధానం అవలంబించవచ్చన్నారు. జామ, నిమ్మ, దానిమ్మ, బత్తాయి, సపోట, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలతో పాటు, మల్లెపూలు, గులాబీ తోటలు వంటి తదితర పంటలకు ప్రభుత్వం రాయితీ ప్రోత్సాహం అందజేస్తుందని సూచించారు. మూడేళ్లపాటు రూ.లక్షా 20 వేల నుంచి రూ.లక్షా 50 వేలు వరకు నిర్వహణ ఖర్చులతో పాటు ఎరువులు, రాయితీగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు 2023-24 సంవత్సరానికి మండలంలో వంద ఎకరాలు సుమారు లక్ష్యంగా పండ్ల తోటల పెంపకం సాగు చేపట్టాలని ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో, ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. చిన్న, సన్నకారు రైతులకు సంబంధించి ఐదెకరాల లోపు రైతులు ఈ సాగుకు అర్హులని, జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, 1బి, అడంగలు, చిన్న, సన్నకారు రైతులు ధ్రువీకరణ పత్రం, రైతు బ్యాంకు ఖాతా ఫొటోస్టాట్ కాపీ, తదితర వివరాలను ఉపాధి హామీ పథకం సిబ్బంది, అధికారులకు అందజేయాలని తెలిపారు. సాగు పట్ల పూర్తి ఇష్టంతో ఉన్న రైతులు పండ్లతోటల పెంపకానికి ముందుకు రావాలని సూచించారు. సమీక్షలో ఎన్ఆర్ఇజీఎస్ ఏపీవో జీ.ఎస్. ఆంజనేయరాజు, వెలుగు పథకం ఎ.పి.ఎం. రంగారెడ్డి, ఉపాధి హామీ పథకం, వ్యవసాయ ఉధ్యానశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి



గండిగనుమలలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీశాఖ అధికారులు

బొల్లాపల్లి: మండలంలోని బొల్లాపల్లి సెక్షన్ పరిధిలోని రావులాపురం, గండిగనుమల, దోమలగుండం ఫారెస్ట్ బీట్ పరిధిలో పలు గ్రామాల్లో పర్యావరణహిత జీవనశైలిపై బుధవారం ఆశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్షన్ డీఆర్‌వో వై. సూర్యనారాయణ పర్యావరణం కాలుష్య నియంత్రణపై ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధించడం, అటవీ ప్రాంతాల్లో ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను పడవేయరాని సూచించారు. ఇంధనం పొదుపు చేయాలని, దీని వలన అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. పూర్తి స్థాయిలో ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ఈ ప్రాంత వాసులంతా కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. ఆయా గ్రామస్తులతో పర్యావరణ జీవన విధానంపై అటవీశాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు, వై. భాస్కర్, గణేష్‌బాబు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పవళింపు సేవ

నకరికల్లు: స్థానిక చౌత్రాసెంటర్‌లో శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి పవళింపుసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కొండపై గల శ్రీఆదిలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా బుధవారం పవళింపు సేవ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ అర్చకులు కొడవటిగంటి మధుసూధనాచార్యులు, పాండురంగాచార్యులు చౌత్రాసెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో ఊయలపాన్పుపై స్వామివార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో మహిళాభక్తులు స్వామి వారి భజనా కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొన్నారు. స్వామివార్లను, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అర్చకులు మధుసూదనాచార్యులు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ శనివారం వరకు పవళింపుసేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వతేదీన 16 రోజుల పండుగ సందర్భంగా కొండ వద్ద పెద్దఎత్తున తిరునాళ్ల మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జీవాలు మూగవి.. మేము కాదు!



ప్రచండ భానుడు తీవ్రతకు మనుషులే కాకుండా మూగజీవాలు సైతం విలవిలలాడుతున్నాయి. వినుకొండలో బుధవారం ఓ ఎద్దు వడదెబ్బకు గురై స్పృహ కోల్పోయింది. దక్షిణంలో బజారులో 16 వార్డులో వీధుల వెంట సంచరించే ఎద్దు ఎండ తీవ్రత ధాటికి బజారులో పడిపోవటంతో స్థానికులు పశుసంచార మొబైల్ వాహనానికి సమాచారమిచ్చారు. సిబ్బంది తక్షణమే స్పందించి సంఘటన ప్రాంతానికి చేరుకుని ఎద్దుకు ప్రాథమిక చికిత్స చేశారు. ప్రస్తుతం ఎద్దు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. ఈ విషయంపై పశువైద్య ఉప సంచారకు రాలు సరోజ మాట్లాడుతూ ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే ట్రోల్‌ఫ్రీ నంబరు 1962 సంప్రదిస్తే తక్షణమే వైద్య సేవలు సకాలంలో అందించి మూగజీవాలను సంరక్షణ చేస్తామన్నారు.

-వినుకొండ (నూజెండ్ల)

చలివేంద్రం ప్రారంభం



శావల్యాపురం: ఈపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి సౌజన్యంతో మండలంలోని గంటా వారిపాలెం గ్రామం చెక్‌పోస్ట్‌లో చలివేంద్రాన్ని ఈపూరు మార్కెటు యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు ప్రారంభించినట్లు వ్యవసాయ మార్కెటు కమిటీ సెక్రటరీ మురళీధర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవిలో వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తెల్లబ్రోలు రాఘవేంద్రరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, టి.రవికుమార్, నాగేశ్వరరావు, నాయక్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

సత్తెనపల్లి: తాతయ్య మందలించాడనే నెపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిందని తాత ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బుధవారం తెలిపారు. పట్టణంలోని 24వ వార్డుకు చెందిన యువతి ఫోన్‌లో వేరొక అబ్బాయితో మాట్లాడుతుండడాన్ని గమనించి తాతయ్య మందలించాడు. ఈ నేపథ్యంలో యువతి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి వరకూ ఇంటికి రాని కారణంగా చుట్టుపక్కల విచారించినా ఆచూకీ లభించక పోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తాతయ్య వీరయ్య ఫిర్యాదు చేశాడు. ఆ మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సత్తెనపల్లిలో అగ్నిప్రమాదం

సత్తెనపల్లి: న్యాయవాది గృహంలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన పట్టణంలోని పార్క్ ఏరియాలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణంలోని పార్క్ ఏరియాలో నివసిస్తున్న న్యాయవాది కంబాల అనీల్ కుమార్ నూతన గృహంలో పై అంతస్తును బట్టల వ్యాపారి దేశు శ్రీనివాసరావుకు అద్దెకు ఇచ్చాడు. ఆ ఇంట్లో ఏర్పాటు చేసిన ఏసీ స్టెబిలైజర్ నుంచి ప్రమాద వశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గృహంలో ఉన్న వారు బయటకు పరుగులు తీయడంతో ఒక్కసారిగా ఏసి పగిలిపోయి ఇంటి పైభాగానికి ఏర్పాటు చేసిన సీలింగ్ కూలిపోయింది. కింద ఉన్న డబల్ కాట్ మంచం, పరుపు, విక్రయం నిమిత్తం తెచ్చిన నూతన దుస్తుల బేళ్ళు కాలిపోయాయి. ఇంటి యజమానికి సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లగా, అద్దెకు ఉంటున్న దేసు శ్రీనివాసరావుకు చెందిన ఏసీ, ఇన్వర్టర్, నూతన దుస్తులు సుమారు రూ. లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. పట్టణ సీఐ యు.శోభన్ బాబు నేతృత్వంలో పోలీసులు, అగ్నిమాపక అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.

మూడేళ్ల పాప పొట్ట నుంచి మెటల్‌చైన్ తొలగింపు

ఎండోస్కోపీ ద్వారా తొలగించిన అష్యూర్ హాస్పిటల్ వైద్యులు



ఆపరేషన్ చేసిన పాపతో డాక్టర్, సిబ్బంది

నరసరావుపేట: తుప్పు పట్టిన ఇనుప చైన్ మింగి కడుపునొప్పి, వాంతులతో బాధపడుతున్న మూడేళ్ల పాపకు అష్యూర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నిఖిలేష్ ఎండోస్కోపీ విధానంలో ఆధునాత వైద్యపరికరాలతో ఆ చైన్ బయటకు తీసి కాపాడిన ఉదంతం నరసరావుపేటలో చోటుచేసుకుంది. బుధవారం డాక్టర్ నిఖిలేష్ తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం విప్పర్లరెడ్డిపాలెంకు చెందిన బాపతు కోటిరెడ్డి కుమార్తె రిషిత గత నాలుగైదురోజులుగా కడుపునొప్పి, వాంతులతో బాధపడుతుండగా తల్లిదండ్రులు తమ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తీసుకొచ్చారన్నారు. ఎండోస్కోపీ చేసి చూడగా పాప కడుపులో మెటల్ చైన్ ఉన్నట్లుగా గుర్తించామన్నారు. పొట్టకోసి ఆపరేషన్ చేయకుండానే అధునాత పరికరాలతో ఎండోస్కోపీ ద్వారా కేవలం పది నిమిషాల్లో ఆ చైన్‌ను తొలగించామన్నారు. దీనికి డాక్టరు, సిబ్బందిని తల్లితండ్రులు అభినందించారు.

రీసర్వే గ్రామాల్లో రైతులకు నోటీసులు పంపిణీ



రీసర్వే పనుల పురోగతి పరిశీలిస్తున్న భాస్కర్

శావల్యాపురం: రీసర్వే పనులు పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు ఫామ్ 9(2) నోటీసుల పంపిణీ కార్యక్రమం వేగవంతం చేయాలని నరసరావుపేట డివిజన్ డిప్యూటీ సర్వే ఆఫ్ అధికారి ఉంగరాల వెంకట భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ మండలంలోని పోట్లూరు రెవెన్యూ పరిధిలో 2425 మంది రైతులు, వేల్పూరు రెవెన్యూ గ్రామంలో 2180 మంది రైతులకు నోటీసులు రైతులకు సకాలంలో అందజేయాలన్నారు. నోటీసులు తీసుకున్న రైతులు రీసర్వే పనుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సమగ్ర ఆధారాలతో సంబంధిత రైతు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తద్వారా సమస్య ప్రాథమిక దశలో పరిష్కార దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రాఫ్ట్ లాండ్ రిజస్టరు నమోదు పనులు రెవెన్యూ అధికారులు చేస్తున్నట్లు చెప్పారు. రీసర్వే పనులకు రైతులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, డిప్యూటీ సర్వే అధికారి పి.నాసరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి



మొక్కలు నాటుతున్న సర్పంచ్ లక్ష్మి

నాదెండ్ల: వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మి చెప్పారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారు. పౌష్టికాహారం, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. జంక్‌ఫుడ్, రెడీమేడ్ ఫుడ్ వాడకం తగ్గించి, తాజా పండ్లు, కూరగాయలు వాడాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలురైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ఏవో సీహెచ్ సరిత

యడ్లపాడు: కౌలుకు సాగు చేసే ప్రతిరైతు కౌలు కార్డు కలిగి ఉండాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత చెప్పారు. బుధవారం ఆమె మాట్లాడుతూ భూమిలేకుండా కౌలుకు తీసుకుని ఖరీప్ సీజన్‌లో సాగుకు సన్నద్ధం అవుతున్న రైతులు తప్పక ఈ కార్డులను తీసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. గతేడాది మండలం పరిధిలో సుమారు 1200 కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది సుమారు 2000 వేల మంది వరకు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అయితే కేవలం భూమిలేకుండా కౌలు చేసుకునే వారే కాకుండా భూమి ఉండి అదనంగా కౌలుకు తీసుకుని సాగు చేసుకునే రైతులకు కూడా ఈకార్డులను జారీ చేయనున్నట్లు చెప్పారు. కార్డు పొందిన కౌలు రైతులకు వైఎస్సార్ రైతుభరోసా ఆర్థికసాయం రూ.13,500, ఈ-క్రాప్ నమోదు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కొనుగోలు, ఉచిత పంటబీమా,మద్దతుధర, పంటరుణాలు, వ్యవసాయ పథకాలు వర్తిస్తాయన్నారు. కావున కౌలు రైతులు భూయజమాని పట్టాదారుపాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, కౌలుదారుడి రేషన్, ఆధార్‌కార్డులతో కౌలు గుర్తింపు కార్డు కొరకు దరఖాస్తును పూర్తి చేసి వీఆర్వోకు అందజేయలన్నారు. అదే విధంగా వైఎస్సార్ రైతు భరోసా అర్హత ఉన్న ప్రతి రైతు అర్జీ పెట్టుకోవచ్చన్నారు.

10 గంటలకల్లా రహదారులు ఖాళీ



ఎండ తీవ్రతతో ఉదయం 11 గంటలకు రొంపిచర్ల ప్రధాన రహదారి ఇలా....



నిర్మానుష్యంగా మారిన చెరువుకట్ట సెంటర్

రొంపిచర్ల: గత వారం రోజులుగా కాస్తున్న ఎండలకు, వడగాల్పులకు మండల ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. ఉదయం 10 గంటల నుండే ఇళ్ల నుంచి బయటకు రావటానికి బయపడుతున్నారు. గ్రీష్మతాపానికి తోడుగా ఉక్కపోతగా ఉండటంతో వయోవృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతల పరిస్థితి ఇబ్బందిగా మారింది. వ్యవసాయ కూలీల పనివేళల సైతం మారిపోయాయి. గత నెల రోజులుగా ఉదయం 7 గంటలకు పనికి వెళ్లి 12 గంటలకు ఇంటికి వచ్చేవారు. గత వారం రోజులుగా నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గ్రీష్మతాపానికి తాళ్లలేక కూలీలు ఉదయం 5 గంటలకే బయలుదేరి వెళ్లి పొలంలో వ్యవసాయ పనులు నిర్వహించుకొని 10 గంటలకే ఇళ్లకు చేరుతున్నారు. కొన్ని వ్యవసాయ పనులను పొలంలోనే పట్టలతో పాకాలు, టెంట్‌లు వేసి కూలీల చేత పనులు చేయించుకుంటున్నారు.

ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి దగ్ధం

యడ్లపాడు: పశువులకు కోసం తీసుకువస్తున్న గ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి మండలం పరిధిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని సొలస గ్రామానికి చెందిన ఓ రైతు పొన్నూరు ప్రాంతంలో ఎండుగడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై లోడ్ చేశాడు. బోయపాలెం సెంటర్‌లో ట్రాక్టర్‌ను పక్కన ఆపి టీ సేవించారు. అనంతరం ట్రాక్టర్‌ను తీసుకుని బోయపాలెం వాటర్ ప్లాంట్ దాటిగానే గడ్డి తగలబడుతుందని బాటసారులు కొందరు కేకలేయడంతో అది విన్న డ్రైవర్ వెంటనే అప్రమత్తమైన ట్రాక్టర్‌ను ఊరి బయటకు తీసుకెళ్లి బ్రిక్స్ కంపెనీ సమీపంలో ట్రక్సును ఎత్తి కాలుతున్న గడ్డిని రోడ్డుపై పడేశాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న గుంటూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది గంటకు పైగా శ్రమించి మంటల్ని అదుపులోకి తెచ్చారు. రోడ్డుపై అడ్డంగా ఉన్న దగ్ధమైన చెత్తచెదారాన్ని జేసీబీ తెప్పించి వాహనాల రాకపోకలకు అడ్డం లేకుండా గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు తొలగించారు. అయితే ఆ మార్గంలో విద్యుత్ తీగలు అడ్డుగా లేకపోవడంతో ఎవరైనా ఆకతాయిలు చేశారా.. లేదా ఎండల వేడికి ప్రమాదవశాత్తు ఏర్పడిందా అన్న విషయం తెలియరాలేదు.. ఏదిఏమైనా పశువుల కోసం రూ.30 వేలు ఖర్చు చేసి దూర ప్రాంతం నుంచి గ్రామం చేరువలోకి తెచ్చాకా ఇలా జరగడం బాధాకరమంటున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో 2023-2024 సంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ బి. రవినాయక్ బుధవారం తెలిపారు. 6వ తరగతిలో చేరటానికి ప్రవేశ పరీక్ష ద్వారా, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు. 6వ తరగతి ప్రవేశం కోరే విద్యార్థులు సెప్టెంబర్ 2011 నుండి ఆగష్టు 2013వ సంవత్సరం మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2021-22, 2022-23 సంవత్సరాలలో చదివి ఉండాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతికి ప్రమోషన్ అర్హత కలిగి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా, ప్రభుత్వ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఫోన్ ద్వారా అయితే 9701030357. 7032996451 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.